క్లుప్తంగా

మాదిగలకు ప్రాతినిధ్యం కల్పించాలి



ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న విప్ అడ్లూరి

ధర్మపురి: రానున్న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు ప్రాతినిధ్యం కల్పించాలని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

బహిరంగ వేలం

జగిత్యాలటౌన్: వాణినగర్‌లోని శ్రీరాజరాజేశ్వర దేవస్థానానికి సంబంధించిన సర్వే నంబర్ 171లోని 2 ఎకరాల భూమిని వ్యాపార నిర్వహణ కోసం గురువారం మధ్యాహ్నం దేవాలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పెండ్యాల వామన్‌రావు శుక్రవారం తెలిపారు.

నేడు బీజేపీ తిరంగా యాత్ర

మల్లాపూర్: మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 4 గంటలకు తిరంగా యాత్రను నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకొని త్రివిధ దళాల సేవలను స్మరించుకుంటూ వారికి కృతజ్ఞతలు తెలిపేందుకే తిరంగా యాత్ర నిర్వహిస్తున్నామన్నారు.

పుస్తె మెట్టెలు అందజేత

కథలాపూర్: బొమ్మెన గ్రామంలో కట్కూరి గౌతమి అనే యువతి వివాహానికి మాజీ సర్పంచ్ పిడుగు లావణ్య-తిరుపతిరెడ్డి దంపతులు పుస్తె మెట్టెలు శుక్రవారం అందజేశారు.

దేవస్థానంలోని సమస్యలు పరిష్కరించాలి

ధర్మపురి: ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి దైవదర్శనం కోసం వచ్చే భక్తులకు సరైన వసతులు కల్పించాలని దేవస్థానం మాజీ చైర్మన్ ఇందారపు రామయ్య కోరారు. దేవస్థానంలో నెలకొన్న సమస్యలపై ఈవో శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. గోదావరిలోని బావి నుంచి పైపుల ద్వారా దేవాలయం ముందున్న సంపులోకి సరఫరా చేస్తూ భక్తులకు తాగునీటిగా అందిస్తున్నారని, కలుషితమైన నీటిని భక్తులకు అందించకుండా చూడాలన్నారు. కొంతకాలంగా దేవస్థానం ముందున్న యాచకులు, స్థానికేతరులతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి నుంచి కాపాడాలని కోరారు.

పాఠశాలలకు నోట్ పుస్తకాలు



ఇబ్రహీంపట్నం మోడల్ స్కూల్‌కు ఆర్టీసీ కార్గోలో చేరుకున్న పుస్తకాలు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందించే పాఠ్య పుస్తకాలతోపాటు నోట్ పుస్తకాలు పాఠశాలలకు అందజేస్తున్నారు. శుక్రవారం ఆర్టీసీ కార్గో ద్వారా మండలంలోని 9 జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన 6 నుంచి 10వతరగతి విద్యార్థులకు 22,190 ఉచిత నోట్ పుస్తకాలు వచ్చినట్లు ఎంఈవో మధు తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఎంఐఎస్ కార్తీక్ పాల్గొన్నారు.

1.38లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

కథలాపూర్: మండలంలో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల ద్వారా 1,38,523 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు ఏపీఎం నరహరి శుక్రవారం తెలిపారు. తాండ్ర్యాలలో 15,446 క్వింటాళ్లు, తక్కళ్లపెల్లిలో 12,550, సిరికొండలో 6,800, పోతారంలో 16వేలు, పెగ్గెర్లలో 9,004, కథలాపూర్‌లో 16,446, గంభీర్‌పూర్‌లో 13,132, దూలూర్‌లో 9,309, చింతకుంటలో 10,487, బొమ్మెనలో 14,770, భూషణరావుపేటలో 5,959, అంబారిపేటలో 8,617 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

తడిచిన ధాన్యం కొనుగోలు చేయాలి

జగిత్యాలరూరల్(రాయికల్): తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా రైతు నాయకుడు మెక్కొండ రాంరెడ్డి అన్నారు. శుక్రవారం రాయికల్‌లో విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి ధాన్యం మొలకలు వస్తున్నాయని, వాతావరణ శాఖ మొదటి నుంచి వర్షాలు కురుస్తాయని హెచ్చరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

పెగ్గెర్ల ఊర చెరువుకు జలకళ



పెగ్గెర్ల గ్రామ శివారులో ఎస్సారెస్పీ వరద కాలువ



నీటితో కళకళలాడుతున్న పెగ్గెర్ల గ్రామ శివారులోని ఊర చెరువు

- వరద కాలువ నీటితో చెరువును నింపుతున్న గ్రామస్తులు
- భూగర్భజలాలు పెరిగి తీరిన సాగు, తాగునీటి సమస్య

కథలాపూర్: ఎండలు తీవ్రరూపం దాల్చడంతో సాగునీటి కోసం రైతులు, తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం అందరికీ తెలిసిందే. కానీ పెగ్గెర్ల గ్రామంలో గ్రామస్తులు చైతన్యంగా ఉండి గ్రామ శివారులో నుంచి వెళ్లే ఎస్సారెస్పీ వరద కాలువ నీటిని వినియోగించుకొని విద్యుత్ మోటార్లతో ఊర చెరువును నింపుతున్నారు. ఫలితంగా వర్షాకాలం, చలికాలం, ఎండకాలం ఆ చెరువు నీటితో కళకళలాడుతుంది. వరద కాలువతోపాటు ఊర చెరువు పుణ్యమాని గ్రామ పరిధిలో భూగర్భజలాలు పెరిగి పంటలకు సరిగా నీళ్లందుతున్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

800 ఎకరాల్లో వరి సాగు

పెగ్గెర్ల గ్రామంలో ఈ యాసంగి సీజన్‌లో సుమారు 800 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. వరద కాలువలో ఎప్పుడు పుష్కలంగా నీళ్లుండటంతో సాగునీటికి ఢోకా లేదని రైతులు తెలిపారు. గ్రామ శివారులోని ఊర చెరువులో నిండుగా నీళ్లుండటంతో భూగర్భజలాలు పెరిగి బోరు బావుల ద్వారా వరి పంటకు నీళ్లందించామని రైతులు తెలిపారు. ఏదేమైనా వరద కాలువతోపాటు ఊర చెరువు వల్ల వరి పంటలు గట్టెక్కాయని పెగ్గెర్ల గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని బోరు బావుల్లో నీళ్లుండటంతో వేసవిలో నీటి సమస్యలు రాలేదని ప్రజలంటున్నారు.

సంతోషంగా ఉంది



ఎస్సారెస్పీ వరద కాలువ మా గ్రామం పక్కనుంచి వెళ్తుంది. అందులో నీళ్లుండటంతో యాసంగిలో పంటలకు సరిగా నీళ్లందాయి. వరద కాలువ నీటితో మా గ్రామంలోని ఊర చెరువును ఎప్పటికప్పుడు నింపుతున్నాం. వరద కాలువ ద్వారా వరి పంటలకు నీళ్లు పారించాం. యాసంగిలో వరద కాలువ, ఊర చెరువు వల్ల పెగ్గెర్లలో సాగు చేసిన వరి పంట చేతికందడంతో రైతులందరం సంతోషంలో ఉన్నాం.

– పాల్తెపు గంగారాం, రైతు, పెగ్గెర్ల



ఆత్మీయ సమ్మేళనం

సారంగాపూర్: రేచపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 2009–10 పదోతరగతి విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనాన్ని తిప్పన్నపేట డీఎస్ గార్డెన్స్‌లో నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి పాదాభివందనం చేశారు. విద్యార్థులు ఏఏ రంగాల్లో స్థిరపడ్డారో, వారి క్షేమ సమాచారాలను ఉపాధ్యాయులతో కలిసి పంచుకున్నారు. ఉపాధ్యాయులు సంగెనభట్ల నర్సింహామూర్తి, డి.శ్రీనివాస్, మహేశ్, నర్సయ్య, శశికుమార్, శేషగిరి, శ్రీహరి, అజయ్‌బాబు పాల్గొన్నారు.

టాటా మ్యాజిక్ ఆటో దగ్ధం



ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని గంగపుత్ర సంఘం వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఏపీ01 టీవీ0228 నంబర్ గల టాటా మ్యాజిక్ ఆటో కాలిపోయింది. ఆటో యాజమాని కల్లెడ ఉదయ్ గంగపుత్ర సంఘం వద్ద టాటా మ్యాజిక్ ఆటో పెట్టి ఇంటికి వెళ్లిపోయినట్లు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో ఆటోలో మంటలు చెలరేగాయి. చుట్టుపక్కలవారు చూసి ఫోన్ చేయడంతో వెంటనే వచ్చి అక్కడే ఉన్న బోర్ మోటార్ వేసి మంటలార్పినట్లు ఉదయ్ తెలిపారు. పక్కనే మరో రెండు ఆటోలున్నా.. తన ఆటోకు ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు అనుమానముందని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

కొనసాగుతున్న ఇంటర్వ్యూలు



ఇబ్రహీంపట్నంలో ఇంటర్వ్యూకు వచ్చిన దరఖాస్తుదారులు

పెగడపల్లి: రాజీవ్ యువ వికాసం పథకం కింద స్వయం ఉపాధి యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలు కొనసాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎంపిక చేసే దరఖాస్తుదారులకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్‌రావు, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుదారులకు బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఎస్సీ కార్పొరేషన్ పథకం కింద రుణాలు పొందేందుకు 276 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఏపీఎం శంకర్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ సాయిదర్శన్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ గోపికృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లాపూర్: దరఖాస్తుదారులకు బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూ నిర్వహించినట్లు ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఎంపీవో జగదీశ్, మండల పరిషత్ సూపరింటెండెంట్ రజని, సీనియర్ అసిస్టెంట్ మహేశ్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ శంకరయ్య, సిబ్బంది తదితరులున్నారు.

కథలాపూర్: మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో శంకర్, ఏపీఎం నరహరి, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. సారంగాపూర్‌లో ఈబీసీ 18 మంది, ముస్లిం మైనారిటీ 12 మంది, ఎస్టీలు 76 మంది హాజరయ్యారు. ఎంపీడీవో చౌడారపు గంగాధర్, ఏపీఎం రాజయ్య, టీజీబీ, కేడీసీసీ బ్యాంకుల ఫీల్డ్ అధికారులు దత్తు, మండల రాకేశ్ పాల్గొన్నారు. బీర్‌పూర్ మండల కేంద్రంలో ఎంపీడీవో లచ్చాలు ఆధ్వర్యంలో మొదటి రోజు 401 మంది, రెండో రోజు 467 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

మెట్‌పల్లిరూరల్: మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో స్వాతి ఆధ్వర్యంలో వివిధ బ్యాంకుల అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈబీసీ 12, మైనార్టీ 46, ఎస్టీ 4 యూనిట్ల కోసం అభ్యర్థులకు ఇంటర్వ్యూ చేశారు.

జగిత్యాల: ఈనెల 24 నుంచి 26 వరకు ఉదయం 10 గంటల నుంచి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ స్పందన తెలిపారు.

మెట్‌పల్లి: ఈనెల 26 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మోహన్ తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలి



జగిత్యాల: ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

జగిత్యాల: విద్యార్థుల భవిష్యత్తును ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకుడు దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వాల్మీకి ఆవాసంలో గొల్లపల్లి, ఎండపల్లి, ధర్మపురి, వెల్గటూర్ మండలాల్లో బోధిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. డీఈవో రాము, కరీంనగర్ డైట్ ప్రిన్సిపాల్ మొండయ్య, ఏపీవో అరుణ పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురిలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం రాష్ట్ర పరిశీలకుడు దుర్గాప్రసాద్ సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గుణాత్మకమైన విద్యనందించాలని సూచించారు. జిల్లా విద్యాధికారి రాము మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచాలన్నారు. రిసోర్స్‌పర్సన్లు, సీఆర్పీలు తదితరులున్నారు.

ఇబ్రహీంపట్నం: మండల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఎస్ఆర్‌సీ అభయ రాజ్ శుక్రవారం సందర్శించారు. కనీస అభ్యాసన సామర్థ్యాలను సాధిస్తూ తరగతివారీ సామర్థ్యాలు సాధించేలా విద్యార్థులను తయారు చేయాలని సూచించారు. మండల విద్యాధికారి మధు, మండల రిసోర్స్‌పర్సన్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

మొక్కలే మానవ మనుగడకు జీవనాధారం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

జగిత్యాలరూరల్(రాయికల్): మొక్కలే మానవ మనుగడకు జీవనాధారమని రాయికల్ మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా ఉమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమం నిర్వహించారు. చెరువు కట్టలు, చెరువు కింద విరివిగా మొక్కలు నాటాలని, వాటి సంరక్షణ బాధ్యత మహిళా సంఘ సభ్యులు తీసుకోవాలన్నారు. మెప్మా ఆర్పీలకు మొక్కలు నాటే కిట్లను అందజేశారు. మెప్మా డీఎంసీ సునీత, సీవో శరణ్య, సిబ్బంది పాల్గొన్నారు.



జగిత్యాలఅగ్రికల్చర్: సాగు సమస్యలపై చర్చిస్తున్న శాస్త్రవేత్తలు

వరి కొయ్యలు కాల్చొద్దు

జగిత్యాలఅగ్రికల్చర్: వరి కొయ్యలను కాల్చకుండా భూమిలోనే దున్నితే రసాయన ఎరువుల ఖర్చును సగానికి సగం తగ్గించుకోవచ్చని పొలాస వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ రవి, డాక్టర్ స్వాతి అన్నారు. పోరండ్ల గ్రామంలో శుక్రవారం రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ విద్యార్థినులు వర్షిణి, హాసీనా, ఏఈవో వరుణ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్(రాయికల్): సేంద్రియ ఎరువులతో రైతులు అధిక దిగుబడులు సాధించొచ్చని పొలాస శాస్త్రవేత్తలు అసోసియేట్ డీన్ డాక్టర్ సైదా నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శేషు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సతీశ్ అన్నారు. శుక్రవారం రామాజీపేట గ్రామంలో రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవో పద్మావతి, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న భక్తులు

సరస్వతీ మాతకు అభిషేక పూజలు

జగిత్యాలరూరల్: పొలాస గ్రామ శివారులోని సహస్ర లింగాల దేవాలయంలో శుక్రవారం సరస్వతీదేవి పుష్కరాల సందర్భంగా సరస్వతీ మాతకు అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు నలమాసు గంగాధర్, భక్తులు పాల్గొన్నారు.

విరమణ పొందిన సైనికులకు సన్మానం



సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

మేడిపల్లి: భారత సైనికులుగా విరమణ పొందిన మేడిపల్లి గ్రామానికి చెందిన బండారి రమేశ్ మద్రాస్ రెజిమెంటల్, మెట్టు ప్రకాశ్, నాంపల్లి అంజయ్యను జెడ్పీహెచ్ఎస్ మేడిపల్లి హైస్కూల్‌లో సన్మానించారు. మండల విద్యాధికారి లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ.. విరమణ పొందిన సైనికులు మేడిపల్లి పాఠశాల విద్యార్థులు కావడం గర్వకారణమన్నారు. ఉపాధ్యాయ, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సైనికులకు జేజేలు



సారంగాపూర్ మండల విద్యావనరుల కేంద్రంలో నినదిస్తున్న ఉపాధ్యాయులు

సారంగాపూర్: భారత సైనికులను అభినందిస్తూ శుక్రవారం సారంగాపూర్ ఉపాధ్యాయులు త్రివర్ణ పతాకాలను చేతబూని సైనికులకు జేజేలు పలికారు. విద్యావనరుల కేంద్రంలో ఎస్టీటీ ఉపాధ్యాయులు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలకు జరుగుతున్న శిక్షణ తరగతుల్లో మధ్యాహ్నం విరామ సమయంలో సైనికుల సేవలను అభినందిస్తూ నినాదాలు చేశారు. ఎంఈవో బుగ్గారపు కిషోర్, ఆర్పీలు పాల్గొన్నారు.

ఆత్మకూర్‌లో సర్వే



భూముల్లో సర్వే చేస్తున్న అధికారులు

మెట్‌పల్లిరూరల్: ఆత్మకూర్ గ్రామ శివారులోని బొమ్మెనకుంట ఆక్రమణకు గురైన వైనంపై ఎస్సారెస్పీ అధికారులు సర్వే నిర్వహించారు. బొమ్మెన కుంట ఎఫ్‌టీఎల్ విస్తీర్ణం మొత్తం 9 ఎకరాలున్నట్లు గుర్తించారు. ఎఫ్‌టీఎల్‌లో 6 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు తేల్చారు. ఆక్రమించిన భూముల్లో మామిడి చెట్లు, పొలం సాగులో ఉంది. 24 హద్దులను ఏర్పాటు చేసిన అధికారులు.. త్వరలోనే వాటికి ట్రెంచ్ లైనింగ్ కొట్టించనున్నట్లు పేర్కొన్నారు. ఏఈలు అనురాగ్, తిరుపతి, వర్క్ ఇన్స్‌పెక్టర్ సురేశ్, వీడీసీ అధ్యక్షుడు బండ శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



రత్నాకర్

జగిత్యాలరూరల్(రాయికల్): తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్‌డమ్(టాక్) నూతన కార్యవర్గాన్ని సంస్థ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల ప్రకటించారు. అధ్యక్షుడిగా రత్నాకర్ కడుదుల, సలహా మండలి చైర్మన్‌గా మట్టారెడ్డి వంటేడు, సలహా మండలి వైస్ చైర్మన్లుగా వెంకట్‌రెడ్డి దొంతుల, గణేశ్ పాస్తం, సలహా మండలి సభ్యులుగా సత్యం రెడ్డి కంది, ప్రవీణ్ వీర, శ్రీధర్‌రావు తక్కలపెల్లి, స్వాతి బుడగం, సెరు సంజయ్, జాహ్నవి ధూసరి, వేణు నక్కిరేడ్డి, ఉపాధ్యక్షులుగా శుష్మునరెడ్డి, సురేశ్ బుడగం, రాకేశ్ పటేల్, ప్రధాన కార్యదర్శులుగా శ్రీకాంత్ జెల్ల, సుప్రజ పులుసు, సత్యపాల్‌రెడ్డి పింగిళి, నేషనల్ కన్వీనర్లుగా అశోక్‌కుమార్ ధూసరి, నవీన్‌రెడ్డి, కమ్యూనిటీ వ్యవహారాల చైర్‌పర్సన్‌గా గణేశ్ కుప్పాల, కమ్యూనిటీ వ్యవహారాల వైస్ చైర్మన్లుగా శ్వేతా మహేందర్, బీరం మల్లారెడ్డి, కార్యదర్శులుగా మధుసూదన్‌రెడ్డి, క్రాంతి రేటినేని, జాయింట్ సెక్రటరీగా రాజేశ్ వాకా, రంజిత్ చాతరాజ్, శశిధర్‌రెడ్డి డోడిల్, ఈవెంట్స్ కల్చరల్ ఇన్‌చార్జిగా సత్య చిలుముల, శైలజ జెల్లా, అధికారిక ప్రతినిధిగా రవి రేటినేని, స్నేహలతారెడ్డి, హరిబాబుగౌడ్ నవాపేట, మధుసూదన్‌రెడ్డి, రాజేశ్ వాకా, శ్రీవిద్య, ఈవెంట్స్ కార్యదర్శిగా శ్రావ్య వందనపు, మాధవరెడ్డి, ఈవెంట్స్ కోఆర్డినేటర్‌గా ప్రశాంత్ మామిడాల, శ్రీనీలిమ, షెఫీల్డ్ కార్యదర్శిగా కె.వి.ప్రసాద్, మిల్టన్ కీన్స్ కార్యదర్శిగా రాజేశ్వర్మ తదితరులను ఎన్నుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

జగిత్యాలటౌన్: జిల్లాస్థాయి బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్ 14, 17 కిక్ బాక్సింగ్ ఎంపిక పోటీలు శుక్రవారం పట్టణంలోని వివేకానంద మినీ స్టేడియంలో నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులు శనివారం నుంచి మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. జిల్లావ్యాప్తంగా వంద మంది క్రీడాకారులు పాల్గొనగా.. ఎంపికయిన విద్యార్థులను జిల్లా క్రీడల అధికారి డా.రవికుమార్, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సాగర్, జాయింట్ సెక్రటరీ అరుణ్ అభినందించారు.